ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- మే 27న పోలింగ్
- జిల్లాలో ఓటర్లు 23,320 మంది
- జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్‌బాషా

ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 29 : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జనగామ జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్‌బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో పట్టభద్రులైన ఓటర్లు మొత్తం 23వేల 320మంది ఉండగా, ఇందులో పురుషులు 14,862, మహిళలు 8,457, ఇతరులు 1 ఉన్నట్లు వివరించారు. జిల్లాలోని జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో 17 పోలింగ్ కేంద్రాలు, స్టేషన్ ఘన్‌పూర్‌లో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మే 2వ తేదీ నుంచి 9 వరకు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, 10వ తేదీన పరిశీలన, 13న విత్‌డ్రా ఉంటాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రవీందర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కలిగి ఉండాలి

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై తహసీల్దార్లకు మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ పత్రాల స్వీకరణకు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికలను భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పకడ్బందీగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ అన్నారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి విచ్చేసిన జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ నగదు, మద్యం రవాణా జరుగకుండా విస్తృత తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే రాజకీయ వార్తలపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల బూత్ కమిటీల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి

సుధీర్‌కుమార్ గెలుపు ఖాయం

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి

చిల్పూరు, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపుఖాయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని క్లస్టర్-3 పరిధి మల్కాపూర్‌లోని 50, 51, 52, 53 బూత్ కమిటీల సన్నాహక సమావేశం సోమవారం జరిగింది. చిల్పూరు మండల ఇన్‌చార్జి జనగామ యాదగిరి అధ్యక్షత వహించగా సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే పార్టీ మారినంత మాత్రాన నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపు కోసం పాటుపడుతూ అధిక మెజార్టీతో గెలిపించి, కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగి అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు అలుగు అశోక్, వరప్రసాద్, మినుగు రాజ్‌భూపతి, తిరుపతిరెడ్డి, రాజ్ ఉమారెడ్డి, నిరంజన్‌రెడ్డి, రాజేందర్, సమ్మయ్య, మాజీ ఉపసర్పంచ్ బబ్బుల వంశీ, మాధవరెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

నేడు జఫర్‌గఢ్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్య పర్యటన

జఫర్‌గఢ్, ఏప్రిల్ 29: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తాటికొండ రాజయ్య మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రఘునాథపల్లిలో ఉదయం 9గంటలకు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని కూనూరు, తిడుగు, కోనాయిచలం, టీబీతండా, రేగడితండా, శంకర్‌తండా, దుర్గ్యాతండా, లక్ష్మీనాయక్‌తండా, తిమ్మడపేట, తమ్మడపల్లి(ఐ), ఉప్పుగల్లు గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు తాటికాయల వరుణ్‌కుమార్, రాజ్‌కుమార్, నాయకులు కుమార్ ఉన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘురామకృష్ణ

కూలీలందరికీ ఉపాధి పని కల్పించాలి

బచ్చన్నపేట, ఏప్రిల్ 29: మండలంలోని గ్రామాల్లో ప్రతి ఉపాధి హామీ కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో రఘురామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని నారాయణపూర్‌లో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కూలీలకు చేతినిండా పని కల్పించాలన్నారు. మస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతివారం మస్టర్ క్లోజ్ చేసి కూలీలకు ఎప్పటికప్పుడు డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీల హాజరుశాతం మరింత పెంచాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవిప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, జలగం కుమార్, బైర్ భార్గవ్, గంగు కృష్ణమూర్తి, పసులాది వెంకటేశ్, కమ్మగాని నాగయ్య, ఎడవెల్లి సోంమల్లయ్య, గాదే పాక భాస్కర్, లావుడ్యా భాస్కర్, బొమ్మగాని భాస్కర్, బైకాని ఐలేశ్, మాదాస్ హరీశ్, గోనె మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

పాలకుర్తి, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికలను నియమ నిబంధనలకు లోబడి పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఏఆర్ఓ రోహిత్‌సింగ్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, అధికారులతో ఈవీఎంలు భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఎన్నికల్లో చేసిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా ప్రబోభాలు లేకుండా చూడాలని, ఒకవేళ ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు విద్యుత్ సదుపాయాలు ఉండాలన్నారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక నిఘా తప్పనిసరి అని చెప్పారు. ఎన్నికల నిబంధన మేరకు నడుచుకోవాలని ఎమరైనా ఎన్నికల నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ వెంకటేశ్, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయి ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు స్కూల్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్ స్వాగత్ రణ్వీర్‌చంద్

ఎంపీ ఎన్నికల ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం నియోజకవర్గంలో మరింత ముమ్మరంగా ప్రచారం చేసేందుకు నియోజకవర్గస్థాయి కో ఆర్డినేటర్లను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ తాటికొండ సురేష్ కుమార్ (స్టేషన్ ఘన్‌పూర్ మాజీ సర్పంచ్), గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి (పీఏసీఎస్ చైర్మన్, ధర్మసాగర్), సేవెళ్లి సంపత్ (కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్), ఆకుల కుమార్ (కుడా మాజీ డైరెక్టర్), వై కుమార్‌గౌడ్ (మాజీ ఎంపీపీ, రఘునాథపల్లి), పసునూరి మహేందర్‌రెడ్డి (పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, జఫర్‌గఢ్), కర్ర సోమిరెడ్డి (మాజీ సర్పంచ్, నారాయణగిరి) కో ఆర్డినేటర్స్‌గా నియమించారు. వీరు పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, క్లస్టర్ ఇన్‌చార్జిలను సమన్వయపరుస్తూ ప్రోగ్రాంలను కో ఆర్డినేట్ చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలని కోరారు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫీజుకు మే 2 ఆఖరు తేదీ

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 29: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువుకు మే 2 చివరి తేదీ అని జనగామ జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) కే ఆంజనేయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు సంబంధిత కళాశాలలో గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. జూన్ 24వ తేదీ నుంచి ఉదయం, మధ్యాహ్నం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఐఈవో తెలిపారు. వేసవికాలం సెలవుల్లో విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్రైస్తవులు

క్రీస్తుజ్యోతి ప్రార్థన పండుగల పోస్టర్ ఆవిష్కరణ

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 29 : కరుణాపురం క్రీస్తుజ్యోతి మందిరంలో మే 3,4, 5, 6, 7 తేదీల్లో ఘనంగా నిర్వహించే ప్రార్థన పండుగల ప్రచార వాల్ పోస్టర్‌ను సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని గెత్సేమనె ప్రార్థన మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి బ్రదర్ హనోకు మాట్లాడుతూ ఆసియా ఖండంలో అతి పెద్ద ప్రార్థన మందిరంలో జరిగే ప్రత్యేక ఆరాధన కార్యక్రమాల్లో క్రైస్తవులు అధిక సంఖ్య లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జీ కృష్ణ, నర్సయ్య, రవి, బాలరాజు, రవి, రాజు, గణేశ్, మల్లయ్య పాల్గొన్నారు.

కడియంది వెన్నుపోటు చరిత్ర

బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్

దేవరుప్పుల, ఏప్రిల్ 29: కడియం శ్రీహరిది వెన్నుపోటు చరిత్రేనని, ఎన్‌టీఆర్ నుంచి కేసీఆర్ వరకు వెన్నుపోటు పొడిచారని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన కడియం ఎమ్మెల్యేగా గెలిచి, బిడ్డకు ఎంపీ టికెట్ ఇచ్చినా వెన్నుపోటు పొడిచి పార్టీ మారి చరిత్ర హీనుడిగా మిగిలారని తెలిపారు. రాజకీయ అనుభవం లేని కావ్యకు టికెట్ ఇప్పించుకున్నారని పేర్కొన్నారు. అమలు కాని అనేక హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశాడని, రైతుబంధు ఇవ్వకపోగా, రుణమాఫీపై మాట మారుస్తున్నాడని తెలిపారు. కల్యాణలక్ష్మిలో తులం బంగారం ఇస్తానని, ప్రతి మహిళలకు రూ. 2500 చెల్లిస్తామని దోకా చేశారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి, పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీమాన్, మండల అధ్యక్షుడు కాసాని సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్, రాష్ట్ర నాయకులు మహేందర్, దామోదర్‌రెడ్డి, గోలి ఉప్పల్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ కోకన్వీనర్ కోటేశ్వర్ ఉన్నారు.

మాట్లాడుతున్న అరూరి రమేశ్

జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా లక్ష్మారెడ్డి

చిల్పూరు, ఏప్రిల్ 29: జనగామ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మల్కాపూర్‌కు చెందిన కేశిరెడ్డి లక్ష్మారెడ్డికి నియామక పత్రాన్ని స్టేషన్ ఘనపూర్ ఇన్‌చార్జి సింగపురం ఇందిర సోమవారం అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ చిల్పూరు మండల ఇన్‌చార్జి తీగల మహేందర్, పార్టీ చిల్పూరు మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, నష్కల్ ఎంపీటీసీ పాశం శిరీషా సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా లావణ్యరెడ్డి

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పెండ్లి లావణ్యరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా నియామకమయ్యారు. ఈమేరకు సోమవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్‌ఘ న్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరా నియామక పత్రాన్ని అందించారు.

చిల్పూరు: కేశిరెడ్డి లక్ష్మారెడ్డికి నియామకప్రతాన్ని అందజేస్తున్న సింగపురం ఇందిర

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి

గీసుగొండ, ఏప్రిల్ 29 : చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు దిలీబన్ అన్నారు. సోమవారం మండలంలోని కొమ్మాల చెక్‌పోస్టును ఆమె సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి, సుస్మితారెడ్డి

వైభవంగా బీరప్ప కల్యాణోత్సవం

బచ్చన్నపేట, ఏప్రిల్ 29 : మండలంలోని కేశిరెడ్డిపల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 26న ప్రారంభమైన ఈ ఉత్సవాలు వచ్చే నెల 4న ముగియనున్నాయి. అందులో భాగంగా సోమవారం గుడి వద్ద బీరప్ప, కామరతి కల్యాణోత్సవాన్ని జరిపించారు. కురుమ కుల పెద్దలు, ఒగ్గు బీర్ల కళాకారులు కల్యాణం కథ చెప్పారు. గ్రామంలోని 53 కురుమ కుటుంబాలతోపాటు ఇతర కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం మందమీద సరుగు వేయడం, గావు పట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఒగ్గు పూజారులు దిడ్డిగ లచ్చయ్య ఆధ్వర్యంలో కురుమలు లింగాలను పట్టుకుని గుడిచుట్టూ ప్రదక్షిణ చేశారు. మంగళవారం కాశీ రామక్క కథ ఉంటుందని కళాకారులు తెలిపారు.

కేశిరెడ్డిపల్లిలో అన్నదానం..

కేశిరెడ్డిపల్లిలో బీరప్ప, కామరతి కల్యాణోత్సవం సందర్భంగా మల్లవరం వెంకటేశ్వర్‌రెడ్డి, సుస్మితారెడ్డి దంపతులు సోమవారం అన్నదానం చేశారు. కురుమ కులస్తులతోపాటు గ్రామస్తులు సుమారు 1500 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి, మాజీ సర్పంచ్ మల్లవరం రమేశ్ రెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం చేసినట్లు తెలిపారు. తన తండ్రి సర్పంచ్‌గా గ్రామానికి, తన తల్లి జయమ్మ ఎంపీపీగా మండలానికి సేవచేశారని గుర్తుచేశారు.

బీరప్ప కల్యాణం కథ చెబుతున్న ఒగ్గు కళాకారులు

చిన్నారులతో సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీల్లోనే పౌష్టికాహారం

బచ్చన్నపేట, ఏప్రిల్ 29 : అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల సూపర్‌వైజర్ కవిత అన్నారు. సోమవారం మండలంలోని కొన్ని గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోనే పిల్లలకు ఆటపాటలతో కూడిన పూర్వప్రాథమిక విద్య అందుతుందని తెలిపారు. పాలు, గుడ్లు, ఆకుకూరలతో భోజనం, నాణ్యమైన బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా బరువు, ఎత్తు, ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన పిల్లలకు స్టార్స్ రూపంలో ప్రోగ్రెస్ కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు మినలాపురం ఉషా, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సలిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఖాసీం

ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచాలి

బచ్చన్నపేట, ఏప్రిల్ 29 : గ్రామంలోని ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలని కొడవటూరు గ్రామ ప్రత్యేకాధికారి ఖాసీం అన్నారు. సోమవారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్యతో కలిసి పల్లెప్రకృతి వనం, నర్సరీ, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. అక్కడ నాటిన మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ ద్వారా నీరు పట్టించాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది రోజువార్డులవారీగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మినాలపురం అశోక్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

కొనుగోలు కేంద్రాల పరిశీలన

జఫర్‌గఢ్, ఏప్రిల్ 29 : మండలంలోని తిమ్మంపేట, సూరారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ అంబటి ఆంజనేయులు సోమవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో కొనుగోలు, ఎగుమతి తదితర వివరాలతో రిజిష్టర్లను ఆయన తనిఖీ చేశారు. కొనుగోలులో రైతులకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు సకాలంలో జమ అయ్యేలా నిర్వాహకులు చేయాలన్నారు. మహిళా సంఘాల బాధ్యులు, రైతులు పాల్గొన్నారు.

చెట్టు మీద పడి ఒకరి మృతి

నర్సంపేట, ఏప్రిల్ 29: చెట్టును నరికే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు మీద పడి ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణం కమలాపురంనకు చెందిన ముత్తినేని శ్రీనివాస్(50) చెట్టును నరుకుతుండగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి శవాన్ని నర్సంపేట పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం వికటించి ఒకరు..

వర్ధన్నపేట, ఏప్రిల్ 29 : పట్టణానికి చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడు చేసిన వైద్యం వికటించడంతో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గీత కార్మికుడు కత్తి నవీన్(28) ఈనెల 26న నీరసంగా ఉండడంతో ఫిరంగిగడ్డకు చెందిన ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. నవీన్‌కు ఆర్ఎంపీ గ్లూకోస్‌లు ఎక్కించడంతో పాటు ఇంజక్షన్లు వేశాడు. దీంతో నవీన్ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. రాత్రి తానే వర్ధన్నపేటలోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించాడు. నవీన్ పరిస్థితి విషమంగా ఉందని వరంగల్‌కు పంపించారు. కాగా ఆదివారం రాత్రి నవీన్ వరంగల్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య కత్తి మేఘన ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నయీంనగర్, ఏప్రిల్ 29 : హత్య కేసులో నిందితులను కేయూసీ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి గ్రామానికి చెందిన పేరం మొగిళి, అతడి చిన్న కుమారుడు శ్రీనివాస్‌ను ఇద్దరు కొట్టారని ఈ నెల 24న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు సాయంత్రం పేరం శ్రీనివాస్ మృతిచెందడంతో ఎస్సై బొజ్జ రవీందర్ దర్యాప్తు చేపట్టారు. పేరం రవీందర్ ఇంట్లో శ్రీనివాస్ ప్లంబింగ్ పనులు చేశాడు. కొన్ని సామాన్లను దాచిపెట్టగా, విషయం తెలిసి పేరం రవీందర్ అతడి తమ్ముడు శ్రీనివాస్ పేరం శ్రీనివాస్‌ను చితకబాదారు. వారి నుంచి శ్రీనివాస్ తప్పించుకుని జరిగిన విషయం ఇంట్లో వారికి చెప్పాడు. మరుసటి రోజు స్పృహ కోల్పోగా, ఈ నెల 26న ఎంజీఎం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, నిందితులు పేరం రవీందర్, శ్రీనివాస్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ ఆందోళన

హసన్‌పర్తి, ఏప్రిల్ 29 : పీఏసీఎస్ గోదాం కట్టేందుకు కాంట్రాక్ట్ తీసుకొని గోదాం నిర్మాణం చేపట్టినా బిల్లులు అందించడంలో సీఈవో రాజిరెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నాడని బాధితుడు రుద్రారపు రాజు వంగపహాడ్‌లోని పీఏసీఎస్ గోదాం ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఏసీఎస్ గోదాంను రూ.27 లక్షలకు కాంట్రాక్ట్ తీసుకొని ఏడాదిలోనే పూర్తి చేశానన్నారు. మూడు నెలల క్రితం రూ.19 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించారని, మిగితా రూ.8లక్షలు బిల్లులు చెల్లిండంతో సీఈవో రాజిరెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపించారు. తెచ్చిన డబ్బులకు వడ్డీ పెరిగి అప్పులపాలయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. సీఈవో తన బిల్